ఊరూరా మార్మోగిన శ్రీరామ నామస్మరణ

కోదాడఅర్బన్ : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా కోదాడ పట్టణం రామనామ స్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ తిలకించేందుకు శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం..

పట్టణంలోని 24వ వార్డు శివాజీ నగర్‌లో భక్తులకు మాజీ ఎంపీటీసీ అంబటికర్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు ప్రారంభించారు. అంతకుముందు స్వామివారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కౌన్సిలర్లు, నాయకులు సామినేని ప్రమీల, రమేష్, కందరబోయిన వీరస్వామి, వేలాద్రి, నూనె సులోచన, బొలిశెట్టి కృష్ణయ్య, కనగాల నారాయణ, యశ్వంత్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు విజయ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

పట్టణంలోని శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ భక్త ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సింధూర అభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అంజయ్య, అన్నదాన నిర్వహణ కమిటీ అధ్యక్షుడు దేవరశెట్టి హనుమంతరావు, సభ్యులు రామారావు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల బైక్ ర్యాలీ

కోదాడలో అయ్యప్ప దీక్షా సమితి ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అయ్యప్ప దీక్ష సమితి ప్రతినిధులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో ఘనంగా శోభాయాత్ర

హుజూర్‌నగర్ : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హుజూర్‌నగర్‌లో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. అయోధ్య నుంచి ప్రత్యక్ష ప్రసారం తిలకించేందుకు ఎస్‌బీహెచ్ బజార్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

రామాలయాల్లో పూజలు

చిలుకూరు : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండల వ్యాప్తంగా శ్రీరాముడు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కొత్త చిలుకూరులోని రామాలయంలో హోమం నిర్వహించారు. పాత చిలుకూరు రామాలయంలో సీతారామలక్ష్మణులను ఆలయ పూజారి సిరికొండ పృథ్వీ గంధంతో అలంకరించారు. ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మఠంపల్లి : అయోధ్యలోని బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. కోదండరామాలయం సమీపంలోని కల్యాణ మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. బక్కమంతులగూడెం, రఘునాథపాలెం రామాలయాల్లో పూజలు చేసి అన్నదానం చేశారు.

మేళ్లచెరువు : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో ప్రజలు ఇళ్ల ముందు ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు.

గరిడేపల్లి : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లో భక్తులు వీక్షించారు. ఈ సందర్భంగా ఆయలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోతె : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని దేవాలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదానం చేశారు.

నడిగూడెం : అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మండల కేంద్రంతో పాటు, సిరిపురం శ్రీ కోదండరామస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ ఇళ్ల ముందు దీపాలు వెలిగించారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

నడిగూడెం : అయోధ్యలో రామాలయంలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో చిన్నారులు సీతారాముడు, లక్ష్మణుడు, హనుమంతుడు తదితర వేషధారణల్లో ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బుస్సా సులోచన, కరస్పాండెంట్ మహేష్, ఉపాధ్యాయులు లక్ష్మి, రమ్య, హనీఫా, నాగమణి, వైదేహి, మల్లిక పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

మునగాల : అయోధ్యలో రామాలయం ప్రారంభం, బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండల కేంద్రంలోని రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయంతో పాటు వెంకట్రాంపురంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ ఆలయం చైర్మన్ తూముల వీరస్వామి, సర్పంచ్ చింతకాయల ఉపేందర్, గ్రామపెద్దలు శ్రీనివాస్, పీవీడీ.ప్రసాద్, రవి, పురోహితులు కందాళ శ్రీనివాసాచార్యులు, రామయ్యశాస్త్రి, కిశోర్ శర్మ, వెంకటరమణశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : అయోధ్యలోని రామ మందిరంలో శ్రీబాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నేరేడుచర్లలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకోదండ రామాలయం ఆవరణలో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ నిలిగొండ వెంకటేశ్వర్లు ధ్వజారోహణ చేశారు. ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ జ్యోతి ప్రజల్వన చేసి వేడుకలను ప్రారంభించారు. ఖమ్మంకు చెందిన సుందరకాండ శ్రీనివాస్ హనుమాన్ చాలీసా పారాయణం చేయగా భక్తులు పరవశించిపోయారు. ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను భక్తులు తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు, అయోధ్య రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, హిందూ పరిరక్షణ సమితి సభ్యులు కొణతం సత్యనారాయణరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చల్లా శ్రీలతారెడ్డి, యడవల్లి వెంకట్‌రెడ్డి, చింతకుంట్ల శ్రీనివాస్, పాల్వాయి రమేష్, సుధాకర్, వెంకన్న, కృపాకర్, గోపాల్‌రెడ్డి, సుబ్బారావు, జనార్దన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వినాయకరావు, తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : అయోధ్యలో రామయ్య విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ ఎంపీ లక్ష్మణరావు, ఆలయ చైర్మన్ గండు సైదులు, ధర్మకర్తలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


కోదాడఅర్బన్ : శ్రీకోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను తిలకిస్తున్న భక్తులు


మునగాల : రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


చిలుకూరు రామాలయంలో సీతారామలక్ష్మణులకు గంధంతో అలంకరణ


నేరేడుచర్లలో భగవత్ ధ్వజం ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్


మునగాలలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


గరిడేపల్లి: రామాలయంలో అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్‌లో వీక్షిస్తున్న ప్రజలు


హుజూర్‌నగర్: రామాలయంలో..


కోదాడఅర్బన్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అయ్యప్ప దీక్ష సమితి సభ్యులు


నేరేడుచర్లలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అయోధ్యలోని బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


చిలుకూరు రామాలయంలో..


మఠంపల్లిలో శోభాయాత్ర


మేళ్లచెరువు రామాలయంలో..


కోదాడఅర్బన్ : శివాజీనగర్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ రంగారావు

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే చందర్‌రావుకు మంత్రి తుమ్మల పరామర్శ


చందర్‌రావును పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కోదాడ : కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు సోదరుడి కుమారుడు దీపక్‌రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం కోదాడలో చందర్‌రావు నివాసానికి వచ్చి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. దీపక్‌రావు చిన్న వయస్సులోనే మృతి చెందడం బాధాకరమని ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో వేనేపల్లి చందర్‌రావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, బొలిశెట్టి నాగేంద్రబాబు, కొణతం శ్రీనివాసరెడ్డి, వేనేపల్లి సతీష్, రావెళ్ల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సమస్యపై కలెక్టర్‌కు వినతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మండలంలోని పాతనెమలిపురి (పులిచింతల ప్రాజెక్టు కాలనీ) గ్రామవాసుల పింఛన్ సమస్యపై సోమవారం జిల్లా కలెక్టర్ వెంకట్రావ్‌కు వినతి పత్రం అందజేసినట్లు చింతలపాలెంకు చెందిన మోర్తాల నాగిరెడ్డి తెలిపారు. ఆ గ్రామవాసులు ప్రతినెలా ఫించన్ కోసం కోదాడ వెళ్లవలసి వస్తుందని చెప్పారు. కలెక్టర్ కలుగజేసుకుని వారికి ఫించన్‌ను పులిచింతల ప్రాజెక్టు కాలనీలోనే అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చింతలపాలెంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ


బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

కోదాడ : ఇంటర్నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ గత సంవత్సరం నవంబర్ 2న నిర్వహించిన ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో కోదాడలోని జయ పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం వేణు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

బాలికల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సర్పంచ్ శిరీషాకొండారెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : కిషోర బాలికల అక్రమ రవాణా, లైంగిక దాడులపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వేపలసింగారంలో గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ అధ్యక్షురాలు పెండెం నాగమణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిషోర బాలికల అక్రమ రవాణా, లైంగిక దాడులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి పెండెం నాగమణి, అంగన్‌వాడీ టీచర్ భాగ్యమ్మ, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ప్రారంభించారని ఫిర్యాదు

మునగాల : మండలంలోని నర్సింహాపురంలో ఉపాధి హామీ పథకం నిధులతో ఇటీవల నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని కొందరు ప్రజాప్రతినిధులు అధికారుల అనుమతి లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి సమయంలో ప్రారంభం చేశారని గ్రామానికి చెందిన పలువురు కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ప్రారంభోత్సవం అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలోనే మద్యం సేవించినట్లు ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం మరో రోజు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని వారు కోరారు. ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన వారిలో గుండు లక్ష్మీనారాయణ, గుండు సుధాకర్, షేక్ నాగుల్, వీరబోయిన రామయ్య, టి.వీరస్వామి, జి.సతీష్, షేక్ ఆజాద్. పి.వెంకన్న, షేక్ జానిమియా ఉన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత

మోతె : మండలంలోని బుర్కచర్ల గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రాఘవాపురం గ్రామానికి చెందిన ఎస్‌కే చాంద్‌పాషా(ఆర్‌ఎంపీ) సోమవారం రూ. 5 వేల విలువ గల నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఉపాధ్యాయులు సింహాద్రి, రాము, సురేష్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు ఎండగట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నాయకులు కంబాల శ్రీనివాస్, పల్లె వెంకటరెడ్డి, కాకి అజయ్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని హనుమాన్ లింగయ్య భవన్‌లో ఎస్‌కేఎం నాయకుడు కొప్పోజు సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. రైతు ఉద్యమ సమయంలో ప్రధాన మంత్రి లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేసి అమలు చేయాలని కోరారు. రుణ విముక్తి చట్టం చేయాలని, పంటల బీమా పథకాన్ని సవరించి అమలు చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు జనవరి 26న నియోజకవర్గం కేంద్రంలో నిర్వహించబోయే ట్రాక్టర్, బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు దుగ్గి బ్రహ్మం, జక్కుల రమేష్, మేకల కనకారావు, ఇందిరాల వెంకటేశ్వర్లు, శీలం శ్రీనివాస్, నూకల చంద్రం, నాగయ్య, వట్టెపు సైదులు, పాసనబోయిన హుస్సేన్, జక్కుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

లెనినిజం చిరకాలం వర్ధిల్లుతుంది

కోదాడఅర్బన్ : లెనినిజం చిరకాలం వర్ధిల్లుంతుందని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వక్కవంతుల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని లాల్ బంగ్లా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో తొలిసారిగా మార్క్సిజాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయింపజేసుకుని విప్లవాన్ని విజయవంతం చేసిన మహానేత లెనిన్ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వి.నర్సింహారావు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి రవి, ఇఫ్టూ జిల్లా నాయకులు నాగయ్య, కామళ్ల శ్రీను, సత్యనారాయణరెడ్డి, చంద్రం, మురళీ, కొండలు, ఖాసీం, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో లెనిన్‌కు నివాళి

కష్టజీవుల రాజ్యాన్ని నిర్మించిన మహానేత లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన లెనిన్ శత వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకపల్లి రాములు, సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.ముత్యాలు, జిల్లా కమిటీ సభ్యులు దేవరం వెంకటరెడ్డి, సత్యనారాయణ, సైదా, రాములు, సూర్యనారాయణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.


కోదాడఅర్బన్ : లెనిన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కోటేశ్వరరావు, నాయకులు

డీఎస్‌ఆర్ పద్ధతిపై రైతులకు శిక్షణ

మోతె : మండల కేంద్రంలో డీఎస్‌ఆర్ (డైరెక్ట్ సీడెడ్ రైస్) ఫార్మింగ్ పద్ధతిపై రైతులకు సోమవారం ఐటీసీ ఎంఎస్‌కె గ్రీన్ క్రాస్ మండల కోఆర్డినేటర్ భూక్య వెంకన్న శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పద్ధతిలో వరి విత్తనాలను నేరుగు సులువుగా విత్తవచ్చన్నారు. రైతుకు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. అధిక దిగుబడి వస్తుందన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

- జడ్జీలు శ్యాంసుందర్, భవ్య

కోదాడఅర్బన్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయనికోదాడ కోర్టు న్యాయమూర్తులు శ్యాంసుందర్, భవ్య పేర్కొన్నారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకొని సోమవారం కోదాడ కోర్ట్ హాల్‌లో న్యాయవాదులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. న్యాయవాదులు నిత్యం కక్షిదారులతో వివిధ కేసులలో తలమునకలై ఉండి వారి వ్యక్తిగత జీవితాలకు కూడా సమయం కేటాయించుకోలేని స్థితిలో ఉంటారని, సమయానుకూలంగా క్రీడాలలో పాల్గొనడం వారికి కొంత మనసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాధు శరత్ బాబు, న్యాయవాదులు కృష్ణయ్య, గట్ల నర్సింహారావు, కుమార్, శ్రీధర్, బాలయ్య, నర్సయ్య, సీతారామరాజు పాల్గొన్నారు.


చెస్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జడ్జీలు శ్యాంసుందర్, భవ్య

ఎంపీపీ పరామర్శ

హుజూర్‌నగర్ : కోదాడ శివారులోని శాంతినగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడెంకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పి.నర్సంహారావు గాయాలతో బయటపడ్డాడు. అతని భార్య నాగమణి, కుమారుడు యశ్వంత్ మృతి చెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులను మేళ్లచెరువు ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వరరావు, మేళ్లచెరువు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నారప రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, స్థానికులు పరామర్శించారు.

ఎమ్మెల్యేకు వినతి

కోదాడరూరల్ : మండలంలోని గణపవరం అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపి అధిక నిధులు విడుదల చేయాలని కోరుతూ ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యేకు తెలిపారు. గ్రామ అభివృద్ధికి తప్పకుండా సహకరిస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రాష్ట్ర స్థాయికి గడ్డిపల్లి విద్యార్థుల ప్రదర్శన ఎంపిక


ప్రయోగాన్ని చూపుతున్న విద్యార్థులు

గరిడేపల్లి : జిల్లా స్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన బాల వైజ్ఞానిక ప్రదర్శనలో గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. 8వ తరగతి విద్యార్థులు వైష్ణవి, ఎస్‌కె హర్షియా ప్రదర్శించిన గ్రీన్ సొల్యూషన్ ఫర్ పొల్యూషన్ ప్రదర్శన రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ట్రైనర్ మారం పవిత్ర తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయుల విభాగంలో భాగంగా జీవశాస్త్రీయమైన పలు అంశాలపై తాను రూపొందించిన నమూనాల ప్రదర్శన రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు మారం పవిత్ర తెలిపారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మునగాల: త్వరలో జరగనున్న ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పి.ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 01.11.2020 కంటే ముందు పట్టభద్రులైన గ్రాడ్యుయేట్లు ఫారం -18 దరఖాస్తుకు ఓటరు నమోదు వివరాలు (ఎపిక్ నెం) ఆధార్ కార్డు, డిగ్రీ లేదా డిప్లొమా సర్టిఫికెట్ల జిరాక్స్, మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ, పాస్ ఫొటో జతపరచిన దరఖాస్తును మండల తహసీల్దార్ కార్యాలయంలో ఫిబ్రవరి ఆరవ తేదీలోగా అందజేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

వయోజనులను చైతన్య పరచాలి


ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ సాయాగౌడ్

కోదాడఅర్బన్ : వయోజనులు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సాయాగౌడ్ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కోదాడ డివిజన్ స్థాయి ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీలను, మహిళా ఉద్యోగినులకు నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వయోజనులు ఓటు నమోదు చేసుకునే విధంగా చైతన్య పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, మండల విద్యాధికారి సలీంషరీఫ్, ఆర్ఐ, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు


హోటల్ యజమానికి జరిమానా విధిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్

హుజూర్‌నగర్ : హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ హెచ్చరించారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని చౌదరిదాబా, రాజ్యలక్ష్మి రెస్టారెంట్, శిల్పి రెస్టారెంట్, న్యూ అప్పారావు హోటళ్లను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యతా లేని ఆహార పదార్థాలు ఉన్న ఆయా హోటళ్లకు మొత్తం రూ.16 వేల జరిమానా, అపరిశుభ్రమైన వంటశాల ఉన్న వసుంధర హోటల్‌కు రూ.500 జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించిన వారికి భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం


చైర్మన్ వీరస్వామిని సన్మానిస్తున్న భక్తులు

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయం కమిటీ సభ్యులు సోమవారం ఆలయంలో ప్రమాణస్వీకారం చేశారు. కమిటీ గౌరవ అధ్యక్షులు నల్లపాటి శ్రీనివాస్, కందిబండ సత్యనారాయణ, కొప్పుల వెంకటనర్సింహారెడ్డి, గౌరవ సలహాదారులు కాసర్ల కోటేశ్వరరావు, చింతకాయల ఉపేందర్, అధ్యక్షుడు తూముల వీరస్వామి, ఉపాధ్యక్షుడు ఉప్పుల జానకిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంధం అంజయ్య, సహాయ కార్యదర్శులు వేట శేఖర్, కుపిరెడ్డి నవీన్ రెడ్డి, కోశాధికారి మరువాడ ఆంజనేయ శర్మ (మీసేవ శర్మ), కమిటీ సభ్యులు కొమ్ము ఈదారావు, నల్లపాటి నాగేశ్వరరావు, తాటికొండ సురేష్, చింతకాయల నాగరాజు, లేళ్ల లింగయ్య, దాసరి వెంకన్న, శెట్టి గిరి, కోదాటి శ్రీను, సింగిశెట్టి సుధాకర్, చలసాని మాధవరావు, అనంతుల శ్రీను ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం గ్రామపెద్దలు కమిటీ చైర్మన్ వీరస్వామిని సత్కరించారు.

26న కోదాడలో నిరసన

కోదాడఅర్బన్ : అధికారంలో ఉన్న మోదీ సర్కార్ అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా జనవరి 26న కోదాడలో నిర్వహించబోయే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు పిలుపునిచ్చారు. సోమవారం కోదాడలోని సుందరయ్య భవన్‌లో జరిగిన కార్మిక, కర్షక ఐక్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఐటీయూ నాయకులు బచ్చలకూరి స్వరాజ్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, బెల్లంకొండ సత్యనారాయణ, మిట్టగడుపుల ముత్యాలు, దేవర వెంకటరెడ్డి, సైదా, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవా గుణాన్ని కలిగి ఉండాలి

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండాలని రెవరెంట్ ఫాదర్ ముప్పాళ్ల జీవీఆర్ అన్నారు. సోమవారం మండలంలోని పొనుగోడులో గల సెయింట్ జోసెఫ్ పాఠశాలలో స్ఫూర్తి సొసైటీ ఆధ్వర్యంలో జర్మనీకి చెందిన స్టెండర్ గ్రూప్ ద్వారా విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ ఫాదర్ అరికె జోసెఫ్, కరస్పాండెంట్ జోసెఫ్, ప్రిన్సిపాల్ సిస్టర్ అనూష, స్ఫూర్తి సొసైటీ చైర్మన్ దయాకర్, జైమోల్ మేరీ, అరుణ, వీరస్వామి, జరీనా, ఉపేంద్రచారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.